క్లుప్తంగా

రీసర్వే పనులు వేగవంతం చేయాలి


పెనుగొల్లులో రీసర్వే పనులు పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ సూర్యనారాయణ

ఎస్.రాయవరం: గ్రామాల్లో చేపడుతున్న రీసర్వే పనులు వేగవంతం చేయాలని రీసర్వే పనులు డిప్యూటీ డైరెక్టర్ సూర్యనారాయణ అన్నారు. పెనుగొల్లు గ్రామంలో చేస్తున్న రీసర్వే పనులను బుధవారం ఆయన పరిశీలించారు. రీసర్వేతో సమగ్రంగా భూముల రికార్డులు సరి చేసి, భూమి హద్దులు నిర్ధారిస్తామన్నారు. భూములు ఉన్న చిన్న, సన్నకారు రైతులు సరిహద్దులు సక్రమంగా లేక, రికార్డులు పూర్తి స్థాయిలో లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రీసర్వేతో ఈ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ రమేష్‌బాబు, మండల సర్వేయర్ మూర్తి, వీఆర్వో సంఘ అధ్యక్షుడు నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు పూజా సామగ్రి పంపిణీ


పంపిణీకి సిద్ధంగా ఉన్న పూజా సామగ్రి

పాయకరావుపేట: ధనధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయాలకు పూజా సామగ్రి పంపిణీ చేయనున్నట్టు ట్రస్ట్ ప్రతినిధి నీలాపురెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. కార్తిక మాసంలో పూజల కోసం నెలకు సరిపడా పూజా సామగ్రి, ఎనిమిది రకాల వస్తువులను ఆలయాలకు అందజేస్తున్నామన్నారు. అలాగే ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు.

నేడు గౌరీపరమేశ్వరుల విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవం

మునగపాక: మండలంలోని గణపర్తి గ్రామంలో గురువారం శ్రీగౌరీపరమేశ్వరుల విగ్రహ ప్రతిష్ట 4వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నారు. అదే రోజు రాత్రి 8 గంటలకు యలమంచిలికి చెందిన గౌరీశంకర్ కూచిపూడి డ్యాన్స్ అకాడమీ కళాకారుల నృత్య ప్రదర్శన జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి గౌరీపరమేశ్వరులను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మరిడిమాంబ ఆలయానికి విరాళం


విరాళం అందిస్తున్న వెంకట స్వామినాయుడు

మునగపాక: మండలంలోని తోటాడ–గవర్ల అనకాపల్లి గ్రామాల నడుమ నిర్మిస్తున్న శ్రీమరిడిమాంబ అమ్మవారి ఆలయ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలువురు భక్తులు ఆలయ నిర్మాణానికి చేయూతనిస్తున్నారు. బుధవారం గవర్ల అనకాపల్లికి చెందిన మళ్ల వెంకట స్వామి నాయుడు తనవంతు సాయంగా రూ.10వేల నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయ కేంద్రాల ఆకస్మిక తనిఖీ


బాణసంచా జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ తారకేశ్వరరావు

నాతవరం: దీపావళి పండగ సమయంలో సామగ్రి వెలిగించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని నాతవరం ఎస్‌ఐ వై.తారకేశ్వర రావు అన్నారు. స్థానిక అయ్యప్ప మందుగుండు సామాగ్రి విక్రయ కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. సామాగ్రి విక్రయ సమయంలో ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఎటువంటి జాగ్రత్తలు చేపట్టాలో సిబ్బంది తగు సూచనలు చేశారు. అనంతరం దీపావళి నాడు ప్రమాదాలు చోటు చేసుకుండా జాగ్రత్తలపై మాక్‌డ్రిల్లు ద్వారా అవగాహన కల్పించారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

మునగపాక: మునగపాక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరగనుందని ఎంపీడీవో ఎం.ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ హాలులో ఉదయం 11 గంటలకు ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలని ఆమె కోరారు.

కూటమి తీరుతో మత్స్యకారుల్లో ప్రాణభయం

- మాజీ ఎమ్మెల్యే చెంగల ధ్వజం
- రాజయ్యపేటలో దీక్షకు సంఘీభావం
- 32వ రోజుకు చేరిన నిరసన దీక్ష

నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా రాజయ్యపేట మత్స్యకారులు చేపట్టిన నిరాహార దీక్షలు 32వ రోజుకు చేరుకున్నాయి. బుధవారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ కార్యనిర్వాహక సభ్యుడు చెంగల వెంకటరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, తదితరులు సంఘీభావం తెలుపుతూ మత్స్యకారులతో కలిసి ఈ దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా చెంగల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ తీరుతో మత్స్యకారుల్లో ప్రాణభయం నెలకొందని ఆరోపించారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో ఏర్పాటైన రసాయన పరిశ్రమల వల్ల అనేక వ్యాధులు, రుగ్మతలతో బాధపడుతున్నారని, తాజాగా బల్క్ డ్రగ్ పార్కు పేరుతో పదుల సంఖ్యలో రసాయన పరిశ్రమలు ఏర్పాటుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ప్రాణభయంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారన్నారు. వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా మొండిగా ప్రభుత్వం వ్యవహరించడం తగదన్నారు.

అచ్యుతాపురం: రాజయ్యపేట మత్స్యకారుల ఉద్యమానికి మద్దతుగా అచ్యుతాపురం జంక్షన్‌లో ప్రజా


అచ్యుతాపురం జంక్షన్‌లో నినాదాలు చేస్తున్న మత్స్యకారులు

సంఘాల ఆధ్వర్యంలో బుధవారం మత్స్యకారుల నిరసన తెలిపారు. సీఐటీయూ మండల కన్వీనర్ కె.సోమునాయుడు మాట్లాడుతూ బల్క్ డ్రగ్ పార్కు వస్తే సముద్రం కాలుష్య కారకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మత్స్యకార కార్మిక సంఘం నాయకుడు చేపల తాతయ్య మాట్లాడుతూ పర్యావరణానికి హాని చేయని పరిశ్రమలు తీసుకురావాలే తప్ప ప్రజలకు ఇబ్బంది కలిగే పనులు చేయరాదని కోరారు. స్థానిక మత్స్యకారులతో చర్చించి వారి మనోభావాలకు తగ్గట్టుగా ప్రభుత్వం వెళ్లాలని హితవు పలికారు. మత్స్యకారులను అణగదొక్కాలని చూస్తే చలో రాజయ్యపేట చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు మేరుగు రాజేశ్, పి.వెంకటేష్, ఎ.వినయ్, కె.అప్పలనాయుడు, రాజేశ్, ముత్యాలు, అప్పలరాజు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.


మత్స్యకారుల దీక్షలో కూర్చున్న వైఎస్సార్‌సీపీ నాయకులు చెంగల వెంకటరావు, వీసం రామకృష్ణ

రాంబిల్లిలో మత్స్యకారుల నిరసన

రాంబిల్లి(అచ్యుతాపురం): బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా రాజయ్యపేట మత్స్యకారులు తలపెట్టిన ఆందోళనకు మద్దతుగా రాంబిల్లిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దేవుడునాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు అండగా నిలవకుండా బలవంతంగా బల్క్ డ్రగ్ పార్కును రుద్దే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. విదేశాల్లో తరిమేసిన బల్క్ డ్రగ్ పార్కును మన రాష్ట్రంలో ఏర్పాటు చేయడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో ధోని కాసియా, చింతకాయల శివాజీ, ఎస్.నారాయణరావు, వై.రాము, తదితరులు పాల్గొన్నారు.



రాంబిల్లిలో నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

ఎస్.రాయవరం: నక్కపల్లి మండలం రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా సాగుతున్న దీక్షలకు సంఘీభావంగా రేవుపోలవరం మత్స్యకారులు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ తీవ్ర విషవాయువులు వెదజల్లే బల్క్ డ్రగ్ పార్కును ఈ ప్రాంతంలో పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. హోం మంత్రి అనిత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ


రేవుపోలవరంలో నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

ఏమైందని నిలదీశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం బల్క్ డ్రగ్ పార్కు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే అన్ని గ్రామాల నుంచి ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మంగ, కొర్లయ్యమ్మ, ముసలి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల కమిటీ నియామకం


గెడ్డమూరి శ్రీనివాసరావు

పాయకరావుపేట: వైఎస్సార్ సీపీ మండల కమిటీని నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. పార్టీ మండల అధ్యక్షుడిగా గెడ్డమూరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా రామాల శ్రీనివాసరావు, యజ్జల సత్యనారాయణ, జనరల్ సెక్రటరీలుగా తూము రమణ, కూండ్రపు శ్రీనివాసరావు, పందిరి ధర్మాజీ, ఇసరపు సత్యనారాయణ, సెక్రటరీలుగా తెరపల్లి చంటిబాబు, శానపల్లి నారాయణమూర్తి, వల్లూరి గోవింద రాజులు, మేడిశెట్టి వీరవెంకట్రావు, దేవవరపు నాగభూషణం, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా అల్లు చంటిబాబు, చాపల సత్తిబాబు, చాపల చంటిబాబు, సిరసపల్లి గోవిందు, చొక్కా సతీష్, కుందేటి కనకారావు, గంటా సత్తిబాబు, యాళ్ళ దనకమ్మ, పల్లా దాసు, చల్లపల్లి గోవిందు, ఎరిపిల్లి జగత్ చంద్ర, కర్రి వీరబాబు, గారా నాని, అల్లాడి రామకృష్ణ, నల్లమాటి అర్జున్ నియామకమయ్యారు. పార్టీలో సముచితమైన స్థానం కల్పించినందుకు పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్‌కు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంబాల జోగులుకు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావుకు కృతజ్ఞతలు వారు తెలియజేశారు.

నియోజకవర్గ యూత్ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు


నాగేశ్వరరావు

ఎస్.రాయవరం: వైఎస్సార్ సీపీ పాయకరావుపేట నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడిగా ఎస్.రాయవరం మండలం సోముదేవుపల్లి గ్రామానికి చెందిన పోచిన నాగేశ్వరరావు నియమితులయ్యారు. పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నాగేశ్వరరావును నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడిగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా పనిచేస్తూ మండలంలో పార్టీ పటిష్టతకు నాగేశ్వరరావు ఎంతో కృషి చేస్తున్నారు. తనకు సముచిత స్థానం కల్పించినందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్‌కు, నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు, తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నాగేశ్వరరావును పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మధువర్మ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

వేద సభ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

యలమంచిలి రూరల్: వేద సభ పరీక్షల్లో యలమంచిలి వేద పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ చూపారు. మహారాష్ట్ర పూణే నగరానికి చెందిన వాసుదేవానంద సరస్వతి సంస్థలో ఈ నెల 4 నుంచి 12వ తేదీ వరకు, బాబా సహస్ర బుద్ధే జయంతి సంస్థలో ఈ నెల 14, 15 తేదీల్లో వేద శాస్త్రోతేజక సభ నిర్వహించిన వేర్వేరు పరీక్షల్లో స్థానిక గాయత్రీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న వేద పాఠశాల విద్యార్థులు సమర్థ కులకర్ణి, అవధూత దేవతాళకర్ ఉత్తీర్ణత సాధించారని ట్రస్ట్ కార్యదర్శి పెద్దింటి సూర్యనారాయణ మూర్తి తెలిపారు. సంహిత, బ్రాహ్మణం, అరణ్యకం, ఏకాగ్నికాండం అంశాలపై నిర్వహించిన సంపూర్ణ మూలాంత పరీక్షల్లో తమ విద్యార్థులు సత్తా చాటారన్నారు. ఇద్దరు విద్యార్థులు వేదాభిజ్ఞ బిరుదు సొంతం చేసుకున్నారన్నారు. వేద పరీక్షల్లో సత్తా చాటిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.


సత్తా చాటిన విద్యార్థులు

తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలి

యలమంచిలి రూరల్: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వరి పంటలో సోకిన తెగుళ్ల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అనకాపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త(పురుగుల విభాగం) డాక్టర్ భవానీ రైతులకు సూచించారు. బుధవారం యలమంచిలి, కట్టుపాలెం, కొత్తపాలెం గ్రామాల పరిధిలో సాగులో ఉన్న వరి పొలాలను శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వరి పొలాలను ఆయా రైతుల సమక్షంలో పరిశీలించి వారితో మాట్లాడి, ఏయే తెగుళ్లకు ఎంత మోతాదులో పురుగు మందులు వినియోగించాలో సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పాలిమేర మోహన్‌రావు, బీసీటీ కేవీకే శాస్త్రవేత్త శ్రీహరి, వ్యవసాయ సహాయకులు అరుణ, రైతులు ఆడారి ఆదిమూర్తి, అప్పలనాయుడు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


యలమంచిలి సమీపంలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

సీసీ రోడ్డు పనులకు భూమి పూజ

మునగపాక: మునగపాకలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని సర్పంచ్ దిమ్మల అప్పారావు తెలిపారు. స్థానిక మధ్యవీధిలో పంచాయతీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునగపాక పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీటి సదుపాయంతో పాటు రహదారులు, కాలువలు వంటి సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు పెంటకోట సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్ అప్పారావు

ప్రతిష్టాత్మకంగా కోటి సంతకాల సేకరణ

మునగపాక: మండల వ్యాప్తంగా గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ కోరారు. క్లస్టర్ ఇన్‌చార్జిలతో బుధవారం ఉదయం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మునగపాక మండలంలో 10 నుంచి 15 వేల మేర సంతకాల సేకరణ జరిగేలా కృషి చేయాలన్నారు. ప్రతి గ్రామంలోనూ నాయకులు, కార్యకర్తలు సమన్వయం చేసుకుంటూ ఇచ్చిన లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. రానున్న స్థానిక సంస్థల్లో విజయం సాధించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయాలని కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న కుతంత్రాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ మళ్ల సంజీవరావు, క్లస్టర్ ఇన్‌చార్జిలు షేక్ ఇస్మాయిల్, సుందరపు తాతాజీ, దొడ్డి సూరప్పారావు, నరాలశెట్టి సూర్యనారాయణ, బొద్దపు శ్రీరామమూర్తి, పెంటకోట హరేరామ, మొల్లేటి నారాయణరావు, కాండ్రేగుల జగన్, సర్పంచ్‌లు దిమ్మల అప్పారావు, బొడ్డేడ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


క్లస్టర్ ఇన్‌చార్జిలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాద్

చెకుముకి పోటీలను విజయవంతం చేయాలి

మునగపాక: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నాలుగు స్థాయిల్లో చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహించనున్నట్లు ఎంఈవో బుద్ధ శివనాయుడు తెలిపారు. ఈ మేరకు సంబరాల పోస్టర్లను బుధవారం ఆయన మునగపాకలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి మారిశెట్టి వెంకటప్పారావుతో కలిసి మాట్లాడారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు నిర్వహించే చెకుముకి పోటీలు స్కూల్ స్థాయిలో ఈ నెల 18న, మండల, పట్టణ స్థాయిలో వచ్చేనెల 1న, జిల్లా స్థాయిలో 23న, రాష్ట్ర స్థాయిలో డిసెంబర్ 12, 13, 14 తేదీల్లో జరుగుతాయన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు రూ.10 రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి రేబాక రవి, దాడి వెంకట అప్పారావు, మాడెం జోగారావు, ఆడారి సతీష్, తదితరులు పాల్గొన్నారు.


మునగపాకలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఈవో శివనాయుడు

ఘనంగా పైడిమాంబ సారె ఊరేగింపు

బుచ్చెయ్యపేట : చిన అప్పనపాలెం గ్రామదేవత పైడిమాంబకు గ్రామస్తులు సారె ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. గ్రామదేవత పైడిమాంబ అమ్మవారి ఆలయ పునఃనిర్మాణ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం సాయంత్రం అమ్మవారికి ఘనంగా సారె ఊరేగింపు చేపట్టారు. మేళతాళాల నడుమ బాణసంచా, నేల వేషాల నడుమ సారె ఊరేగింపు ఘనంగా చేపట్టి అమ్మవారిని దర్శించుకున్నారు. గురువారం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన చేపట్టనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.


అమ్మవారికి సారె ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

17, 18 తేదీల్లో మండల స్థాయి క్రీడా పోటీలు

మునగపాక: మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈ నెల 17, 18 తేదీల్లో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు పీడీ రవి ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలు ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతాయన్నారు. అండర్ 14, 17 విభాగాల్లో బాలురు, బాలికలకు ఈ పోటీలు జరుగుతాయన్నారు. 17న బాలికలకు, 18న బాలురకు పోటీలు నిర్వహిస్తామన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ తదితర పోటీలు జరుగుతాయన్నారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని రవి కోరారు.

నేటి నుంచి ఆటల పోటీలు

ఎస్.రాయవరం: కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో శుక్రవారం నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు పీడీ అమ్మొరయ్య తెలిపారు. అండర్ 14, 17 విభాగాల్లో బాలురకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ క్రీడలు నిర్వహిస్తామన్నారు. 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు అండర్–14 విభాగంలో జనవరి 2012 తరువాత, అండర్–17 విభాగంలో జనవరి 2009 తరువాత జన్మించి ఉండాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 94935 97428లో సంప్రదించాలన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

అనకాపల్లి: బాల్య వివాహాలు నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా స్త్రీ శిశుసంక్షేమ శాఖ అధికారి సూర్యలక్ష్మి తెలిపారు. మండలంలో తుమ్మపాల జెడ్పీహెచ్ స్కూల్‌లో అంతర్జాతీయ బాలికా దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడైన బాల్య వివాహాలు జరిగినట్లయితే దగ్గరలో పోలీస్‌స్టేషన్, అంగన్‌వాడీ కేంద్రాల్లో సమాచారం ఇచ్చిన వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. బాల్య వివాహాలపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ కమిటీలను ఏర్పాటు చేశామని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని, సెక్సువల్ హెరాస్మెంట్, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్స్, బాలికల అక్రమ రవాణా, బాలికల ఉన్నత చదువుల కోసం కిశోర బాలికలకు వంటి వాటిపై ఆమె వివరించారు. కార్యక్రమంలో హైస్కూల్ సిబ్బంది, అంగన్‌వాడీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.


బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సూర్యలక్ష్మి

గ్రామ పంచాయతీల ఏర్పాటుకు వినతి

తుమ్మపాల: గ్రామాల్లో పెరుగుతున్న జనాభా, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు కోరారు. డీఆర్వో సత్యనారాయణరావుకు వినతి పత్రం అందించారు. దశాబ్దాల క్రితం ఏర్పాటైన గ్రామ పంచాయతీలే నేటికీ కొనసాగుతున్నాయన్నారు. పంచాయతీల్లో శివారు గ్రామాల్లో పెరుగుతున్న జనాభా ఆధారంగా అర్హత అవకాశాలను పరిశీలించి ఆయా గ్రామాల్లోని ప్రజల అభిప్రాయాల మేరకు నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటు చేయాలన్నారు. బడుగు, బలహీన వర్గాలకు కేటాయించిన కాలనీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు అధికంగా నివసించే ప్రాంతాలను వాటి అవకాశాలను పరిశీలించి నూతన గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసినట్లయితే ఆయా వర్గాలకు స్థానిక సంస్థల్లోనైనా రాజకీయ ప్రాధాన్యత కలుగుతుందన్నారు.


డీఆర్వోకు వినతి పత్రం అందిస్తున్న మాణిక్యాలరావు, నాగభూషణరావు

నవంబర్ 24న చలో ఢిల్లీ

అనకాపల్లి: దేశంలో ఏ ప్రభుత్వ ఉద్యోగికి లేకుండా ఒక్క ఉపాధ్యాయులకు మాత్రమే టెట్‌లో తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధిస్తేనే పదోన్నతి అని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ నవంబర్ 24న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వేలాది మందితో ధర్నా నిర్వహించనున్నట్లు అఖిల భారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య, ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) జిల్లా అధ్యక్షుడు బోయిన చిన్నారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చెల్ల నాగేశ్వరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెట్‌పై తమ నిర్ణయాన్ని మార్పు చేయాలని, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు మినహాయింపును ఇవ్వాలని కోరారు. ఇప్పటికే ఈ విషయమై రివ్యూ పిటిషన్ కోర్టులో వేశామన్నారు. ధర్నా కార్యక్రమంలో ఉత్తర్‌ప్రదేశ్, గుజరాత్, హర్యానా, ఢిల్లీ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, అసోం, మిజోరాం, మేఘాలయ, మణిపూర్, వెస్ట్ బెంగాల్, ఒడిశా, దక్షిణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది ఉపాధ్యాయులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై వినతి

అనకాపల్లి: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రధాన కార్య దర్శి గొంది చిన్నబ్బాయి తెలిపారు. జీవీఎంసీ విలీన గ్రామం కేఎన్ఆర్‌పేటలోని డీఈవో కార్యాలయంలో డీఈవో గిడ్డి అప్పారావునాయుడుకు యూటీఎఫ్ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు

అనకాపల్లి: జీఎస్టీ తగ్గింపుతో ధరలు తగ్గుముఖం పట్టాయని, ప్రజలకు మంచి లాభం చేకూరుతుందని మండల విద్యాశాఖ అధికారులు –1,2 శ్రీదేవి, కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో నిత్యావసర సరకులు, వివిధ రకాలైన వస్తువుల ధరలు తగ్గాయన్నారు.

కుటీర పరిశ్రమలు కేరాఫ్ నక్కపల్లి

నక్కపల్లి: విశాఖ–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటులో భాగంగా కుటీర పరిశ్రమలు నక్కపల్లికి క్యూకడుతున్నాయి. నక్కపల్లి మండలంలో పలు పెద్ద కంపెనీలు ఏర్పాటు కానున్న నేపథ్యంలో వాటికి అనుబంధంగా చిన్న చిన్న పరిశ్రమల ఏర్పాటుకు సన్నాహాలు మొదలయ్యాయి. రాజయ్యపేట సమీపంలో బల్క్ డ్రగ్ పార్క్, చందనాడ సమీపంలో ఆర్సెలర్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కాబోతున్నాయి. బల్క్ డ్రగ్ పార్క్‌ను మత్స్యకారులు వ్యతిరేకిస్తున్నప్పటికీ స్టీల్‌ప్లాంట్‌పై మాత్రం పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు సానుకూలత వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ సానుకూల వాతావరణంలో సాగింది. ఈ నేపథ్యంలో ఈ రెండు కంపెనీలకు అనుబంధంగా కుటీర పరిశ్రమలు నక్కపల్లి మండలానికి క్యూకడుతున్నాయి. ఫ్యాబ్రికేషన్, ఇంజినీరింగ్, ఈపీవీసీ, సిమెంట్ బ్రిక్స్, చిన్నపాటి వెల్డింగ్ షాపులు ఇబ్బడిముబ్బడిగా ఏర్పాటవుతున్నాయి. ఇప్పటికే మండలంలో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. జాతీయ రహదారిని ఆనుకుని, నక్కపల్లి, వెదుళ్లపాలెం, న్యాయంపూడి, చినదొడ్డిగల్లు తదితర ప్రాంతాల్లో చిన్న కంపెనీలు ఏర్పాటు చేసేవారు ముందుగానే స్థలాలను కొనుగోలు చేసి సిద్ధం చేసుకున్నారు. ఆయా స్థలాల్లో షెడ్లు వేసి అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నారు. సివిల్, ఎలక్ట్రికల్, ఇంజినీరింగ్ పనులకు సంబంధించిన యంత్ర సామగ్రిని ఏర్పాటు చేసి ఉపాధి పొందేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.

జాతీయ రహదారి వెంబడి నక్కపల్లి నుంచి వేంపాడు వరకు ఇరువైపులా రెస్టారెంట్లు, హోటళ్లు సైతం ఏర్పాటవుతున్నాయి. ఇక రియల్ ఎస్టేట్ వ్యాపారులు ముందుగానే తక్కువ ధరకు స్థలాలను కొనుగోలు చేసి లేఅవుట్లు వేసి ప్లాట్ల విక్రయాలు చేపడుతున్నారు. మరి కొంతమంది తమకున్న స్థలాల్లో చిన్నపాటి షెడ్లు ఏర్పాటు చేసి కామన్ బాత్ రూములు, నీటి సదుపాయాలు కల్పించి కంపెనీల్లో పని చేసే కార్మికులకు అద్దెకు ఇచ్చే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రస్తుతం మండల కేంద్రం నక్కపల్లిలో ఇళ్లకు గిరాకీ ఏర్పడింది. స్థానికులకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.


నక్కపల్లి సమీపంలో జాతీయ రహదారి పక్కన ఏర్పాటైన ఓ పరిశ్రమ